క్లుప్తంగా

30న మండల సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహాలక్ష్మి తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులంతా సమాచారంతో హాజరుకావాలన్నారు.

రీసర్వేపై ఫిర్యాదులు స్వీకరిస్తాం

మద్దిపాడు: రీసర్వేపై ఎటువంటి అభ్యంతరాలున్నా.. పొలాల వివరాలు సరిగా నమోదు కాకపోయిన తహసీల్దార్‌కు అర్జీలు ఇవ్వాలని ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న అన్నారు. మంగళవారం సీతారామపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ప్రసంగించారు. రీసర్వేలో తమ పొలాలున్న మేరకు విస్తీర్ణం నమోదు కాలేదంటూ ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని అందుకే గ్రామ సభలు నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. తహసీల్దార్ సదరు భూములను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకొని రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటారని తెలిపారు. తహసీల్దార్ సృజన్ కుమార్, జయంత్‌బాబు, పలువురు టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగుల సహాయకుల కోసం డార్మిటరీ

ఒంగోలు టౌన్: జీజీహెచ్‌లో వైద్య చికిత్స కోసం వచ్చే రోగుల సహాయకుల సౌకర్యం కోసం డార్మిటరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ఆదేశించారు. ఇటీవల జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు ఆయన ఆస్పత్రి పారిశుధ్యం, ఇతర సౌకర్యాల గురించి అసంతృప్తి వ్యక్తం చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తీసుకున్న చర్యలను వివరించేందుకు మంగళవారం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.దుర్గాదేవి కలిశారు. పారిశుద్ధ్యంపై తీసుకున్న చర్యల గురించి మంత్రికి వివరించారు. అత్యవసర మరమ్మతుల కోసం ఎన్టీఆర్ వైద్య సేవల నిధుల నుంచి రూ.4 లక్షలు కలెక్టర్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ..ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటుగా వారి సహాయకులకు కూడా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. టాయిలెట్స్, డ్రస్ ఛేంజింగ్ రూంలతో పాటు అన్ని రకాల సౌకర్యాలతో కూడిన డార్మిటరీ కోసం నిధులు విడుదల చేయించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

నగరంలో బాల కార్మికులకు విముక్తి

ఒంగోలు వన్‌టౌన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో కార్మికులుగా పని చేస్తున్న బాలలను గుర్తించి వారికి విముక్తిని కల్పించినట్లు జిల్లా ఉపకార్మిక కమిషనర్ ఎ. గాయత్రి దేవి తెలిపారు. బాల కార్మికుల నిర్మూలనకై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీ ఆధ్వర్యంలో నగరంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నగరంలోని గాంధీరోడ్డు, వీఐపీ రోడ్డు, సౌత్‌బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో 4గురు బాలకార్మికులను గుర్తించి పని నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. బాల కార్మికులతో పని చేయిస్తున్న యజమానులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 16 సంవత్సరాల్లోపు బాలలతో పనిచేయిస్తే వారిని బాల కార్మికులుగా పరిగణించి యజమానులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్మిక శాఖ ఒంగోలు సహాయ కార్మిక శాఖ అధికారి ఎం. ఎలిజబెత్తమ్మ, పోలీసు శాఖ, సంక్షేమ శాఖలు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకావిష్కరణ


భగవద్గీత పుస్తకావిష్కరణలో నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్, స్థానిక వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో డాక్టర్ ఆకెళ్ళ విభీషణశర్మ రచించిన మానవులందరికీ భగవద్గీత పుస్తకావిష్కరణ మంగళవారం టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమంలో హెచ్‌ఎం సైకం వెంకటరెడ్డి, ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం మాజీ సభ్యుడు పాలపర్తి లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలాం ట్రస్టు అవార్డు అందుకున్న మౌలాలీ

మార్కాపురం టౌన్: పట్టణానికి చెందిన, తర్లుపాడు మండలం లింగారెడ్డికాలనీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం షేక్ మౌలాలీ కలాం ట్రస్టు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేషంగా కృషి చేసిన వ్యక్తులకు తిరుపతికి చెందిన కలాం నేషనల్ ఫెలోషిప్ ట్రస్టు వారు ఈ అవార్డును అందిస్తారని, తనకు ఇస్రో ఓఎస్డీ కె.లక్ష్మణకుమార్ తనకు అందించారని తెలిపారు. సందర్భంగా కలాంను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు సైన్సు విషయాలపై దృష్టి పెట్టే విధంగా అవగాహన కల్పిస్తున్నానని మౌలాలీ తెలిపారు. ఈయన గతేడాది రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కూడా అందుకున్నారు.

ప్రజారోగ్యానికి సంకటం


కొణిజేడు బస్టాండ్ సెంటర్‌లో పెద్ద మసీదుకు ఆనుకొని ఒక పెద్ద చెత్తకుప్ప


రోడ్డుపైనే పడేసిన చెత్తకుప్ప


అదేరోడ్డులో రెండు దేవాలయాల వెనుక వైపు కూడా

- నగరంలో పేరుకుపోతున్న చెత్త నిల్వలు
- డంపింగ్ యార్డులను తలపిస్తున్న వైనం
- కొణిజేడు బస్టాండ్ సెంటర్‌లో దుర్గంధం
- ఆధ్యాత్మిక పరిసరాల్లోనూ దుస్థితి

ఒంగోలు సబర్బన్: నగర పాలక సంస్థ నిర్లక్ష్యంతో ప్రజారోగ్యం చిక్కుల్లో పడుతోంది. మొన్నటి వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఇళ్లలోకే మురుగు ప్రవహిస్తుండటంతో నగరవాసులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. అలాగే ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. వర్షాకాలంలో అవి నీటిలో తడుస్తూ దారుణమైన పరిస్థితులను కల్పిస్తున్నాయి. ముఖ్యంగా నగరం నడిబొడ్డులోని రాజాపానగల్ రోడ్డు దాటిన తరువాత ఉన్న కొణిజేడు బస్టాండ్ పరిసరాలు దుర్గంధంగా మారాయి. ప్రధాన రహదారిపైనే ఒక పెద్ద చెత్త కుప్ప చేరి డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఓ టిప్పర్‌కు సరిపడే అంత మొత్తంలో చెత్తను స్థానికులు తీసుకొచ్చి రోడ్డుపైనే వదిలేశారు. కానీ నగర పాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు చోద్యం చూస్తున్నారు. ఆ రోడ్డులో రాకపోకలు సాగించేవారు ఆ దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. ఆ చెత్త కుప్పకు ఎదురుగా కొణిజేడు బస్టాండ్ సెంటర్‌లోనే పెద్ద మసీదు ఉంది. మరో వైపున శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయం, దానికి ఆనుకొని శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయం, ఇంకొంచెం ముందుకు వెళితే శ్రీ రామాంజనేయ స్వామి దేవాలయం ఉంది. ఇంతటి పవిత్రమైన ప్రాంతంలో కూడా పారిశుద్ధ్య లేమి నెలకొంది. ఆ రోడ్డు నుంచే ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు కూడా అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కానీ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో.. ఎటువంటి రోగాలు రాకుండా ప్రజలను కాపాడటంలో ఎలాంటి ప్రయత్నాలు కనిపించడంలేదు. కనీసం బ్లీచింగ్ చల్లేందుకు కూడా అధికారులకు తీరుబడి దొరకడం లేదు. అసలే వర్షాకాలం కావడంతో ఇప్పటికే డెంగీ కేసులు నమోదవుతున్నాయి. అలాగే టైఫాయిడ్, చికున్ గున్యా, మలేరియా, వైరల్ ఫీవర్లు ఎక్కడ ప్రబలుతాయోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు.

ప్రవర్తనలో మార్పు రాకుంటే కఠిన చర్యలు


సంతనూతలపాడులో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అజయ్ బాబు


నాగులుప్పలపాడు: రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై శ్రీకాంత్

సంతనూతలపాడు: స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం సాయంత్రం సబ్ ఇన్‌స్పెక్టర్ వేజండ్ల అజయ్ బాబు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేరస్తుల ప్రవర్తనలో మార్పు తెచ్చుకుని సత్ప్రవర్తనతో మెలగాలని, రౌడీ షీటర్ ఇప్పటికైనా మారాలని సూచించారు. రౌడీ షీటర్లు నిత్యం కేసుల్లో చిక్కుకుంటే బెయిల్ రద్దు చేసి తిరిగి జైలుకు పంపుతామన్నారు. మంచి జీవితాన్ని గడపాలనుకునే వారు గొడవ జరుగుతుంటే అక్కడ నుంచి తప్పుకోవాలి సూచించారు.

నాగులుప్పలపాడు: పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి ప్రస్తుతం వారి చర్యలు, పని విధానాలపై వివరాలు ఆరా తీశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రెవెన్యూ గ్రామ సభకు 47 అర్జీలు


మాట్లాడుతున్న సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి

సంతనూతలపాడు: మండల పరిధిలోని పి. గుడిపాడు గ్రామంలో మంగళవారం జరిగిన రీ సర్వే, ఇతర భూ సమస్యలపై పరిష్కారం కోసం జరిగిన గ్రామసభలో 47 అర్జీలు స్వీకరించినట్లు సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. గుడిపాడు సర్పంచ్ కె.పుష్ప అధ్యక్షత వహించగా తహసీల్దార్ ఆదిలక్ష్మి వివరాలు వెల్లడించారు. రీ సర్వేలో తప్పులు జరిగితే అర్జీలు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. రీసర్వేలో భూములు విస్తీర్ణంలో వ్యత్యాసం, ఎల్ పీఎం సబ్ డివిజన్, కొత్త పాస్ పుస్తకాల కోసం ఈ అర్జీలు దాఖలయ్యాయి. డిప్యూటీ తహసీల్దార్ ఎస్. మాబు సుభాని, ఆర్‌ఐ రామ్ తేజ, వీఆర్వో కె. రవికుమార్, గ్రామ సర్వేయర్ సుధాకర్ పాల్గొన్నారు.

చీమకుర్తి రూరల్: మండలంలో మంచికలపాడులో తహసీల్దార్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ గ్రీవెన్స్ నిర్వహించారు. మంచికలపాడు, చీమలమర్రి, రెడ్డి నగర్ రైతులు 34 అర్జీలు అందజేశారు. విస్తీర్ణంలో వ్యత్యాసంపై 10 అర్జీలు, జాయింట్ ఫీల్డ్ విభజించడం కోసం 13 అర్జీలు, మ్యూటేషన్ కోసం 11 అర్జీలు అందజేశారు. సర్పంచ్ పెరికల నాగేశ్వరరావు, ఎంపీటీసీ అత్యాల అంకయ్య, పొన్నపల్లి సుబ్బారావు, అత్యాల యేసేపు, జడ రాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి


అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసులు


మాట్లాడుతున్న సంతనూతలపాడు ఎంపీడీఓ సురేష్ బాబు


నాగులుప్పలపాడు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహాలక్ష్మి

మద్దిపాడు: మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వి.జ్యోతి అన్నారు. మంగళవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు గ్రామ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, వైద్యశాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ప్రత్యేకంగా రికార్డులు నిర్వహించాలని.. ప్రతి 15 రోజులుకు ఒకసారి గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రపరచాలని తెలిపారు. డయేరియా వంటి వ్యాధులు ఎక్కువగా నీటి ద్వారానే వస్తాయని, నీటిని వేడిచేసి తాగేవిధంగా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కోరారు. గ్రామ కార్యదర్శులు ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నీటి నిల్వలు ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేయించి.. దోమలు పెరగకుండా చూసుకోవాలని తెలిపారు.

బ్లీచింగ్ నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. ఆయిల్ బాల్స్ తయారు చేసే విధానం , ఫ్లాగింగ్ చేయటానికి ఎబేట్ ఏవిధంగా ఉపయోగించాలో వైద్యశాఖ సూపర్‌వైజర్ బాలకోటయ్య వివరించారు. ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, ఆసుపత్రి డాక్టర్ ఆనంద్ మోహన్ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, మెడికల్ ఏఎన్‌ఎంలు , వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

కొత్తపట్నం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల పరిషత్ పరిపాలనాధికారి బి.శ్రీనివాసులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అంటువ్యాధులపై పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా అన్ని గ్రామ పంచాయతీల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కాచి చల్లార్చిన నీరు తాగడం, నిల్వ ఉన్న ఆహారం తీసుకోకుండా వేడి అన్నం తీసుకోవాలని సూచించారు. రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, గ్రామాల్లో బ్లీచింగ్, సున్నం వేయాలన్నారు. నీటి ట్యాంకులు ప్రతి రోజూ శుభ్రపరచాలన్నారు. మంచినీటిలో క్లోరినేషన్ టాబ్లెట్లు వేయాలని సూచించారు. ఈఓఆర్డీ వేణు, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ శివపార్వతి, విద్యాశాఖాధికారి తులసీ కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై చైతన్యపరచాలి

సంతనూతలపాడు: సీజనల్ వ్యాధుల నిర్మూలనపై సచివాలయం, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ప్రజలను చైతన్య పరచాలని సంతనూతలపాడు ఎంపీడీఓ డి. సురేష్ బాబు వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పలు శాఖల ఉద్యోగులతో జరిగిన సీజనల్ వ్యాధుల నిర్మూలన, జాగ్రత్తల ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గ్రామ సచివాలయ పరిధిలో వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. కాలువల్లో మురుగు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈఓ డి. వెంకారెడ్డి, ఈఓఆర్డీ ఎం.రమణమ్మ, వేములపాడు మెడికల్ ఆఫీసర్ సుమన్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతి ప్రియ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మావతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: ప్రజారోగ్యం పట్ల సిబ్బంది గ్రామాల్లో జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ మహాలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశలో మాట్లాడారు. గ్రామాల్లో శానిటేషన్, ఆరోగ్య శిబిరాల నిర్వహణలో తగు సూచనలు తీసుకోవాలన్నారు.

రాయితీపై శనగలు సిద్ధం


రైతులతో మాట్లాడుతున్న ఏవో రమేష్

మద్దిపాడు: రాయితీపై శనగలు అందుబాటులో ఉన్నట్లు ఏఓ రమేష్ తెలిపారు. మంగళవారం పొలంబడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నందిపాడులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. రాయితీపై శనగలు అందుబాటులో ఉన్నాయని రైతులు వాటిని వినియోగించుకోవాలని కోరారు. జేజీ 11 ఎర్రశనగలు పూర్తి ధర రూ.9400 ఉందని క్వింటాకు 25 శాతం సబ్సిడీ రూ.2350 ఇస్తున్నామని రైతుల రూ.7050 , అదే విధంగా కాక్ తెల్ల శనగలు పూర్తి ధర రూ.12100 ఉందని క్వింటాళ్లకు 25 శాతం సబ్సిడీ రూ.3025 ఉందని, రైతులు రూ.9075తో రైతులు కొనుగోలు చేసుకోవచ్చునని చెప్పారు. రైతుల అభ్యర్థనను ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని తెలిపారు.

సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ ప్రారంభం

సంతనూతలపాడు: మండలంలోని రుద్రవరం.. గురవారెడ్డి పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోందని కార్యక్రమం సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారి పి.పావని ఆధ్వర్యంలో నిర్వహించారు. శనగ విత్తనాలను రాయితీపై అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఇస్తున్నామని.. రైతు సేవ కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కేవీ సుబ్బారెడ్డి, రుద్రవరం.. గురవారెడ్డి పాలెం గ్రామాల వ్యవసాయ.. పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

రుణాల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధర

ఒంగోలు వన్‌టౌన్: బ్యాంక్ లింకేజీ రుణాల గ్రౌండింగ్‌ను వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ టి.వసుంధర సిబ్బందికి సూచించారు. ఒంగోలు టెక్నికల్ ట్రెనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 38 మండలాల కమ్యూనిటీ కో ఆర్డినేటర్స్, ఎల్‌డీఎం, ఇతర బ్యాంకు అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 25న ఒంగోలు ఏ-1 ఫంక్షన్ హాలులో స్వయం సహాయక గ్రూపులకు రూ.100 కోట్ల రుణాల పంపిణీ చేస్తారన్నారు. ఇప్పటి వరకు రూ.60 కోట్ల గ్రౌండింగ్ పూర్తయినట్లు తెలిపారు. కెనరా బ్యాంకు ఎల్‌డీఎం, ఇతర బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం రిలీఫ్ చంద్రన్నా

- ఎస్సీ, ఎస్టీ కేసుల రిలీఫ్ కోసం రూ. 50 కోట్లు అడిగితే..
- 5 కోట్ల రుపాయలను విదిల్చారు


మాట్లాడుతున్న దళిత నాయకుడు నీలం నాగేంద్ర

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు కింద నమోదైన కేసుల్లో బాధితులకు 50 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం కేవలం రూ.5 కోట్ల రూపాయలను మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకుందని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయ స్వామి సొంత జిల్లా అయిన ప్రకాశం జిల్లాకు 55.60 లక్షలను మాత్రమే మంజూరు చేశారని, ఇది 2022లో నమోదైన కేసులకు కూడా చాలవని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు హత్య, అత్యాచారం, బలవన్మరణాలకు గురైతే మృతుల కుటుంబ సభ్యులకు, బాధితులకు, ఒక్కొక్కరికి 8. 25 లక్షల రూపాయల రిలీఫ్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో నాణ్యమైన వైద్యం అందించాలి

కొమరోలు: ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది నాణ్యమైన వైద్యం అందించాలని ఎంపీడీవో మస్తాన్‌వలి తెలిపారు. మండల కేంద్రమైన కొమరోలులోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని, ప్రజలకు రోగాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ చైతన్యదీపక్, డాక్టర్ రజియా సుల్తానా పాల్గొన్నారు.

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

మార్కాపురం: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ఎన్జీవో డివిజన్ కార్యదర్శి బి.శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ కార్మికుల ఉపాధి ఊడగొట్టే చర్యలు మానుకోవాలని, తొలగించిన కార్మికులను వెంటనే వీధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ఏకపక్షంగా కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. 25 సంవత్సరాలుగా మార్కాపురం మున్సిపాలిటీలో ప్రజల కోసం అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు అందే నాసరయ్య, ఎంపీజే రాష్ట్ర నాయకుడు రజాక్, మాలమహానాడు నాయకుడు నూతలపాటి దేవరాజ్, కేవీపీ నాయకులు రాజు, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకుడు రాంబాబు, పట్టణ పౌర సంఘాల సమైక్య నాయకులు డి.సోమయ్య, ఏఐటీయూసీ నాయకులు ఖాసిం, జేవీవీ నాయకులు వై.రవికుమార్, డివైఎఫ్ఐ నాయకులు విక్టర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఏం రఫీ, మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం ప్రాంతంలో 3,735 హెక్టార్లలో పంట నష్టం

- పత్తి రైతుకు అధిక నష్టం
- అధికారుల ప్రాథమిక అంచనా


నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయాధికారులు


పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసులు

మార్కాపురం: మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మార్కాపురం, పెద్దారవీడు, తర్లుపాడు, కంభం, అర్ధవీడు మండలాల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుమారు 9,342 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని (3,735 హెక్టార్లలో) మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ తెలిపారు. ఇందులో పత్తి 3,001 హెక్టార్లు, పొగాకు 347, సజ్జ 2.47, కొర్ర 8, మినుములు 295, అలసంద 83 హెక్టార్లలో ప్రాథమికంగా పంట నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. ఇంకా పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేస్తామని చెప్పారు. ముఖ్యంగా పత్తి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవి పత్తి సాగు చేసిన రైతులకు నష్టం ఎక్కువగా ఉంటోంది. కాయలు వచ్చి పత్తి దిగుబడి వచ్చే సమయంలో వర్షాలకు, గాలులకు పత్తి మొక్కలు పడిపోవడంతో పాటు తీవ్ర వర్షానికి కాయలు కుళ్లిపోయాయి. దీంతో దిగుబడులు రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌లోనే నష్టపరిహారాన్ని తమకు అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

మార్కాపురం రూరల్: వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను మార్కాపురం ఏడీఏ బాలాజీనాయక్, ఏఓ శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని జమ్మనపల్లి, కొత్తపల్లి పంట పొలాలకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. పంట పొలాల్లో నీరు నిలిస్తే వెంటనే నీటిని తొలగించి పత్తి, మిరప పొలాల్లో యూరియా 50 కేజీలు, పొటాషియం 30 కేజీలు వేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న పంట పొలాలకు సంబంధించిన నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపుతున్నట్లు ఏఓ తెలిపారు. వీఏఎస్ అశ్వనీ, సర్పంచ్ వెంకటేశ్వర్లు, జమ్మనపల్లి వీఎస్ఏ సంధ్య పాల్గొన్నారు.